సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం ॥ 11 ॥ జూలై ॥ 2024



చక్కని చిత్తరువులు
ఆకట్టుకునే చిత్రాలు గీస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు. అంశం ఏదైనా అలవోకగా చిత్రాలు గీస్తూ రాణిస్తున్నారు. 8లో ▸



విద్యుత్ విజిలెన్స్ దాడులు
నూజివీడు మండలంలోని అన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో మొత్తం రూ.5.53 లక్షల జరిమానా విధించారు. 8లో ▸



జ్యూస్ దుకాణం సీజ్
శ్రీవారి క్షేత్రంలో జ్యూస్‌ల తయారీలో నిల్వ పాల ప్యాకెట్లను వినియోగిస్తూ భక్తుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వ్యాపారి బాగోతం బట్టబయలైంది. 8లో ▸

న్యూస్‌రీల్

నారసింహుని అవతారంలో జగన్నాథుడు



నారసింహుని అవతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జగన్నాథుడు నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో సాక్షాత్కరిస్తున్నారు. అందులో భాగంగా శంఖు చక్రాలను ధరించి, అమ్మవారితో ఆసీనులై ఉన్న స్వామివారు భక్తులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టు ఉన్న అలంకారం భక్తులకు కనువిందు చేసింది.

శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందిస్తున్న మాలమహానాడు నాయకులు

భీమవరం: దళితులకు శ్మశాన వాటికలు కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. జిల్లాలోని దళితుల శ్మశాన వాటికల సమస్యలను పరిష్కరించాలని బుధవారం కలెక్టర్ సీహెచ్ నాగరాణికి వినతిపత్రం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆచంట నియోజవర్గం ఆలమూరులో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని జనవరిలో ఆందోళన చేసినా ఇంతవరకు పరిష్కరించలేమన్నారు. ఉండి నియోజకవర్గం వాండ్రం లంకలో దళితుల స్మశాన వాటికను ఆక్రమించిన 77 సెంట్లు అధికారుల సమక్షంలో విడిచీశారని ఇంతవరకు ఫెన్సింగ్ చేయలేదని, ఎన్మార్పీ అగ్రహారంలో శ్మశాన వాటికకు సరైన సదుపాయాలు లేవని, భీమవరం మండలం వెంప గ్రామంలో శ్మశాన వాటికలో చెరువులకు రోడ్లు వేసుకున్నారని, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు పుష్పరాజ్ చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందించి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, తోర్లపాటి భాగ్యరాజ్, పిట్టా వినోద్‌కుమార్, చిరా సాయి, చిగురుపాటి రాజేష్ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో డిప్యూటీ తహసీల్దార్ పవన కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన లేబర్ కోడ్‌లు రద్దుచేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు జిల్లా నాయకులు డి.కళ్యాణి, బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోర్కెల దినాన్ని పురస్కరించుకుని భీమవరం సీఐటీయూ ఆఫీస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారందరికీ కనీస వేతనాలు అమలు చేసి పర్మిట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనీస వేతన చట్టాన్ని సవరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్‌కు అందచేశారు.

నేడు తణుకులో జాబ్ మేళా

తణుకు టౌన్: ఈ నెల 11న తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో బీటీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఈ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సంస్థలో అక్కౌంటెంట్లు, ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్స్, టాక్స్ ఏజెన్సీ, కెమిస్ట్ పోస్టుల భర్తీ కోసం ఈ జాబ్‌మేళాలో ఎంపిక జరుగుతుందన్నారు. 2021-2024 మధ్య డిగ్రీ పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు 9866215054, 9381838672లో సంప్రదించాలని కోరారు.

పేరుకే ఉచితం.. అంతా దోపిడీ

- ఉమ్మడి జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లు, మూడు స్టాక్ యార్డ్‌లు ప్రారంభం
- మిగతా ఇసుక రీచ్‌ల అనుమతులు పెండింగ్‌లోనే
- వరద ముంపు అనుమతులు లేకపోవడంతో తెరుచుకోని రీచ్‌లు
- చేబ్రోలు స్టాక్‌పాయింట్‌లో టన్ను ధర రూ.538
- రవాణా ఖర్చులు అధికం
- ఉచితమంటూ జీఎస్టీ, సీనరేజ్, అడ్మిన్, లోడింగ్ చార్జీలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉచిత ఇసుక పాలసీ అంటూ కూటమి ప్రభుత్వం చేసిన ఆర్భాటమంతా డొల్లేనని తేలింది. ఒక్క రూపాయి చెల్లించకుండా నిర్మాణ అవసరాలకు పూర్తి ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. దానికి అనుగుణంగానే అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక పథకం ప్రారంభిస్తున్నామని విపరీతంగా ప్రచారం చేసి మంగళవారం నుంచి అమలులోకి తెచ్చారు. కట్ చేస్తే.. జీఎస్టీ మొదలుకొని టన్ను ఇసుక వరకు ప్రతి దానికి ధర నిర్ణయించి అనేక ఆంక్షలు విధించి ఉచిత ఇసుక మాటున దోపిడీకి తెరదీశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గోదావరి నది పరివాహక ప్రాంతం అధికంగా ఉంది. ఈ క్రమంలో ఏలూరు జిల్లాలో ఐదు ఇసుక రీచ్‌లు, 3 డీసిల్ట్ రీచ్‌లు ఉన్నాయి. జిల్లాలో ఆరు స్టాక్ యార్డులున్నాయి. నూతన పశ్చిమగోదావరి జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లు, 5 డీసిల్టిటేషన్ పాయింట్లు, 6 స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఇవన్ని గతం నుంచే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో కేవలం కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, వింజరం, ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులోని స్టాక్ పాయింట్లలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. మిగిలిన ఏ ఒక్క రీచ్ కూడా పూర్తి స్థాయిలో తెరుచుకోలేదు. పర్యావరణ అనుమతులు పెండింగ్‌లో ఉండటం, నిబంధనలకు అనుగుణంగా లేకపోవడం, గోదావరి వరద ప్రారంభం నేపథ్యంలో ఒక్క రీచ్ కూడా ప్రారంభం కాలేదు. అధికారులు మాత్రం జిల్లా అంతటా ఉచితంగా ఇసుక లభిస్తుందంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇబ్రహీంపేట, దాచారం, వింజరం, వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట 1, 2, పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతంలోని 1, 2, నడిపూడి 1, 2, కరుగొరుమిల్లి, కోడేరు,



ఉంగుటూరు మండలం చేబ్రోలులోని ఇసుక స్టాక్ పాయింట్

ఏలూరు జిల్లాలో గూటాల, గూటాల-1, పట్టిసీమ, పశ్చిమగోదావరి జిల్లాలో యలమంచిలి, నర్సాపురంలో ఐదు డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి.

అధిక ధరలు.. కఠిన ఆంక్షలు

ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు స్టాక్ పాయింట్, ఇబ్రహీంపేట, వింజరం స్టాక్‌పాయింట్లలో ఇసుక విక్రయాలు ప్రారంభించారు. వీఆర్‌ఓ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని ఆధార్ కార్డు జిరాక్స్‌తో చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు ధర రూ.538 చెల్లించి ఇసుక కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అధికారికంగా లోడింగ్ చార్జీలు రూ.30, అడ్మిన్ చార్జీలు రూ.20, సీనరేజ్ ఫీజు రూ.88, జీఎస్టీ రూ.13.40 మొత్తం కలిపి రూ.152లు టన్ను ఇసుక ధరలోనే కలిపి తీసుకుంటున్నారు. అనధికారికంగా మాత్రం లోడింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు టన్ను రూ.538 చొప్పున ఒక లారీ లోడుకు (20 టన్నులు) రూ. 10,760 చెల్లించాలి. 50 కిలోమీటర్ల పరిధి వరకు రూ.6 వేల నుంచి 8 వేలు, 50 కిలోమీటరు దాటితే రూ.120 వసూలు చేస్తున్నారు. రవాణా చార్జీ అదనంతో వసూలు ఇష్టానుసారం సాగుతుంది. 70 కిలోమీటర్ల దూరానికి ఇసుకను తీసుకెళ్లాలంటే లోడింగ్, ఇసుక ఖర్చు కలిపి రూ. 20 వేల వరకు ఉంది. గత ప్రభుత్వ హయాంలో టన్ను ధర రూ.100కు తక్కువ ఉండటం గమనార్హం.

పశ్చిమలో నో స్టాక్:

పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక నిల్వలు ఫుల్‌గా ఉన్నా 6 ఇసుక రీచ్‌లు, 5 డీసిల్టేషన్ పాయింట్లలో ఎక్కడా ఇసుక లేని పరిస్థితి. అనుమతులు రాకపోవడంతో అన్ని రీచ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పశ్చిమగోదావరి జిల్లా వాసులు, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం పందలపర్రు, పెరవలి మండలం పెండ్యాల, కోనసీమ జిల్లాలోని రావులపాడు స్టాక్ పాయింట్ల నుంచి తెచ్చుకోవాలి. అవి భీమవరానికి సగటున 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. 20 టన్నుల లారీకి అన్ని ఖర్చులు కలిపి రూ. 15 వేల వరకు అవుతుండగా రోజుకు లారీ ఒక ట్రిప్ మాత్రమే పడుతుందనే కారణంగా అదనంగా మరో రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. రావులపాడు, పందలపర్రు స్టాక్‌పాయింట్ నుంచి 20 టన్నుల లారీ భీమవరానికి వస్తే రూ.17 వేలు, నర్సాపురానికి రూ.15 వేలు, పాలకొల్లు రూ.12 వేలు, ఉండి రూ.18 వేలు, తాడేపల్లిగూడెం రూ.15 వేలు, తణుకు రూ.11 వేలు, ఆచంట రూ.10 వేలు వసూలు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఏరియా ఆసుపత్రిలో జిల్లా స్థాయి సేవలు అందించడానికి కృషి చేయాలని కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. బుధవారం ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రసూతి వార్డు, మందులు నిల్వ కేంద్రం, పరిపాలన, ఓపీ విభాగాలు, ల్యాబ్, స్కానింగ్, ఎక్స్‌రే యూనిట్లను పరిశీలించి సూచనలు జారీ చేశారు. తొలుత ప్రసూతి వార్డు సందర్శించి నవజాత శిశువులు, తల్లులకు అందుతున్న వైద్య సహాయంపై ఆరా తీశారు. కాల పరిమితి ముగిసిన మందులను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేసి, ఆ మందులను విడిగా భద్రపరచాలన్నారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా? అని ఆరా తీశారు. ప్రస్తుతం భీమవరం ఏరియా ఆసుపత్రి 50 పడకల స్థాయిలో కొనసాగుతుందని, నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే వైద్య సేవలను మరింత విస్తరించడానికి అవకాశం ఉంటుంది అని ఆస్పత్రుల సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ డా.పి.సూర్యనారాయణ కలెక్టర్‌కు వివరించారు. పరిశీలన అనంతరం కలెక్టర్ మెడికల్ సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు. ఓపీ విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని, రోగులకు అందిస్తున్న సేవలను విస్తృత పరచాలని సూచించారు. ఓపి విభాగం హాల్లో రోగులు కూర్చోడానికి ఇబ్బంది లేని విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు పలు సూచనలు చేసినట్లు వివరించారు. తనిఖీ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డా.మాధవి కళ్యాణి, ఆర్ఎంఓ డా.ప్రవీణ్, వైద్యులు తదితరులున్నారు.



ప్రభుత్వాసుపత్రి విభాగం వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణ చెల్లదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని పీవీ రావు మాల మాహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవర ప్రసాద్ అన్నారు. బుధవారం భీమవరం బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం ముగిసిపోయి అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉంటున్న మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడానికి, ఓటు బ్యాంకు రాజకీయాలకోసం వర్గీకరణ అంశాన్ని మళ్లీ తెరపైకి తెస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని చూసే ఏ పార్టీకైనా మనుగడలేకుండా చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రంపై స్పందించిన కేంద్ర మంత్రి ఈ అంశం ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బండి శ్యాంబాబు, ఇంజేటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

పెరుగుతున్న గోదావరి వరద



పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్ద ప్రవహిస్తున్న వరద

పోలవరం రూరల్: గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. ఉప నదుల నీటితో పాటు కొండ కాలువల నీరు కూడా నదిలోకి చేరడంతో ఉధృతి పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్ద బుధవారం 26.770 మీటర్లకు నీటిమట్టం చేరింది. 48 గేట్ల నుంచి నీరు దిగువకు చేరుతోంది.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం



ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: ఉచిత ఇసుక పాలసీ ప్రజలకు వరమని సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఉచిత ఇసుక పంపిణీపై ప్రజల అవగాహన కల్పించేందుకు ఇసుక ట్రాక్టర్‌తో బుధవారం మంత్రి పార్థసారథి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇసుక పాలసీతో నిర్మాణ రంగం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూజివీడు పట్టణాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు.

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి చర్యలు

జాయింట్ కలెక్టర్ సి.వి.ప్రవీణ్ ఆదిత్య



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు, పెన్షన్ మంజూరు, సొంతంగా వ్యాపారం నిర్వహించుకునేందుకు ప్రభుత్వ రుణాలు, అర్హులైన వారికి రేషన్ కార్డు వంటి వాటికి చర్యలు తీసుకుంటామన్నారు. సొంతంగా స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం, స్థలం లేనివారికి స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎలాంటి ధ్రువపత్రాలు కావాలన్నా, సంక్షేమ పథకాలు కావాలన్నా సచివాలయాలలో దరఖాస్తు చేయాలని, పరిశీలించి గడువులోగా మంజూరు అవుతాయని చెప్పారు. సమావేశంలో ట్రాన్స్‌జెండర్లు మాట్లాడుతూ ఆధారు కార్డులు లేవని, కార్డులో తప్పులు సరిచేయాలని, రేషన్ కార్డులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలియజేయగా జాయింటు కలెక్టరు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.డి మహేశ్వరరావు, డీఎస్‌వో యస్.సరోజ తదితరులు పాల్గొన్నారు.

కాల్వల ప్రక్షాళనకు నిధుల మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఆయకట్టు పరిధిలోని కాల్వల్లో గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులకు రూ.545.79 లక్షలు, డ్రెయిన్లకు సంబంధించి 35 పనులకు రూ.592.59 లక్షలు మంజూరైనట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. డీ సిల్టింగ్, షట్టర్ల మరమ్మతులు, ఇతర పనుల నిమిత్తం మొత్తం 90 పనులకు రూ.848.91 లక్షల ఆమోదం కోసం ప్రతిపాదనలు సమర్పించామన్నారు. భీమవరం డ్రెయినేజీ డివిజన్‌కు సంబంధించి గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులకు రూ.914.46 లక్షలు, డీసిల్టింగ్ పనులకు రూ.712.48 లక్షల ప్రతిపాదనల్ని ఆమోదం కోసం సమర్పించామన్నారు.

రైతుల సార్వా పాట్లు

- ధాన్యం సొమ్ములు, పెట్టుబడి సాయం అందక మందకొడిగా సాగు
- జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో సార్వా సాగు
- ఇంతవరకు కేవలం 22 వేల ఎకరాల్లో నాట్లు

భీమవరం: పంట కాలువలకు ముందుగానే సాగునీరు విడుదల, విస్తారంగా వర్షాలు, అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ జిల్లాలో సార్వా వరినాట్లు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వం రైతుకు సకాలంలో ధాన్యం సొమ్ములు చెల్లించడం, సాగుకు ముందుగానే రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం అందించడంతో రైతులు ఎంతో ఉత్సాహంతో సాగుకు సన్నద్ధమయ్యేవారు. ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా కనబడుతోంది. రైతులు దాళ్వా ధాన్యం ఆర్బీకేలకు విక్రయించి నెలలు గడిచిపోతున్నా నేటికీ పూర్తిగా చెల్లింపులు జరగనేలేదు. గత ప్రభుత్వం సాగుకు ముందుగా అందించే పెట్టుబడి సాయం సొమ్ములు చేతికి అందకపోవడం, చంద్రబాబునాయుడు రైతులకు కేంద్ర ప్రభుత్వంతో కలసి రూ.20 వేలు సాయం అందిస్తామని చెప్పినా ఇంతవరకు ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.20 లక్షల ఎరాల్లో నాట్లు వేయాల్సివుంది. జూలైలో పది రోజులు గడిచిపోయినా కేవలం 22 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు.



తాడేపల్లిగూడెం ప్రాంతంలో సార్వా వరి నాట్లు

రైతులకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా రైతులకు అనేక విధాలుగా వెన్నుదన్నుగా నిలబడ్డారు. ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రాలను(ఆర్బీకే) ఏర్పాటుచేసి రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరలకే విక్రయించడమే గాకుండా ఆర్బీకేల్లోనే రైతులకు సూచనలు అందించేలా ఏర్పాటుచేశారు. ఏటా సాగుకు ముందుగానే కేంద్ర ప్రభుత్వంతో కలిసి రైతులకు పెట్టుబడి సాయంగా రూ.13,500 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసేది. ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలుకు పెంచుతామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి అధికారం చేపట్టి నెల రోజులు గడిచిపోతుంది. సార్వా సీజన్‌కు రైతులంతా సన్నద్ధమై నారుమళ్లు పూర్తిచేసి నాట్లు వేయడానికి దుక్కులు దున్నుకున్నారు. కేంద్రప్రభుత్వం అందించే సాయం రైతులకు అందింది. ఇంతవరకు రాష్ట్ర సాయంపై ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో ఈ పంటకు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందే పరిస్థితి లేనట్లేనని రైతులు నిర్ధారణకు వచ్చి పెట్టుబడులు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

గతంలోనే ఇదే తరహా మోసం

గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను అనేక విధాలుగా మోసం చేసిన సంగతిని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో రైతులు రుణాలను మాఫీ చేస్తానని వాగ్దానం చేసి ముంచారు. రుణమాఫీ బాండ్లు ఇచ్చినా అతిగతీ లేకుండా పోయాయి. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఒక్క రూపాయి చెల్లించకుండానే విడుదల చేయిస్తానని ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఇప్పుడు కూడా చంద్రబాబు హామీలను నెరవేర్చడం కష్టమేనని రైతులు చర్చించుకుంటున్నారు.

“ 22 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి



జిల్లాలో ఇంతవరకు దాదాపు 22 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తిచేశారు. ప్రధానంగా తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, ఇరగవరం, ఆచంట వంటి మండలాల్లో ఎక్కువ శాతం నాట్లు వేశారు. మిగిలిన చోట్ల అంతంతమాత్రంగానే నాట్లు పడ్డాయి. రైతులు ఎక్కువగా ఎంటీయూ 1318, స్వర్ణ, సంపత్‌స్వర్ణ వంటి రకాల నారుమళ్లు వేశారు. ఆగస్టు 10 నాటికి నాట్లు పూర్తయ్యే అవకాశముంది.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

సామాజిక అంశాలపై అవగాహన అవసరం



భీమవరంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరరావు

భీమవరం: విద్యార్థులకు చిన్నతనం నుంచే సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఉమా మహేశ్వరరావు అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని పలు పాఠశాల్లో విద్యార్థులకు పోటీలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు మున్సిపల్ (పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూల్లో పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి అరసవల్లి సుబ్రహ్మణ్యం, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



పెనుగొండలోని గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్న సునీల్ రాజ్‌కుమార్

పెనుగొండ: పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఏపీ రెసిడెన్షియల్ స్కూలు సెక్రటరీ సునీల్ రాజ్‌కుమార్, ఏఎంవో సంజీవరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. జూన్ 13 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించిన బ్రిడ్జి కోర్సు విధానంపై ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రశ్నించారు. 2023–24 సంవత్సరానికి 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించడంపై అభినందించారు. కొత్త విద్యా సంవత్సరంలో 100 శాతం ఫలితాలను సాధించాలని దిశానిర్దేశం చేశారు. పాఠశాలలోని సదుపాయాలు పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాళ్ల: ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ముదినేపల్లి మండలం పెద్దగుర్రం ఆరుకు చెందిన రమణమ్మ (55) బంధువైన శంకర్‌తో కలిసి మంగళవారం చెవిటి మిషన్ తీసుకునేందుకు బైక్‌పై భీమవరం వెళుతున్నారు. పెదఅమిరం వద్దకు వచ్చేసరికి బైక్ గొయ్యిలో పడటంతో రమణమ్మ అదుపుతప్పి కింద పడిపోగా ఆమె తలకు గాయమైంది. భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలిచారు. అక్కడ చిక్సిత్స పొందుతూ మృతి చెందింది. హెచ్‌సీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

178 సర్వీసులకు రూ.5.53 లక్షల జరిమానా

నూజివీడు: అన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ బృందాలు బుధవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో రూ.5.53 లక్షల జరిమానాను విధించారు. విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు, నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో 47 బృందాలు ఏకకాలంలో 2,955 గృహ సర్వీసులను, 113 వాణిజ్య సముదాయ సర్వీసులను, 7 పారిశ్రామిక సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో 175 సర్వీసులకు అదనపు లోడు వాడుతున్నారని గుర్తించి రూ.5.42 లక్షల జరిమానా విధించారు. అలాగే విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న మూడు సర్వీసులకు రూ.11 వేల జరిమానాను విధించారు. విద్యుత్ చౌర్యంపై 94408 12362, 8331 014951 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు కోరారు. తనిఖీల్లో డీఈలు ఓలేటి దుర్గారావు, పోతురాజు, గౌరునాయుడు, కె.నారాయణ, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

చిట్టి చేతుల్లో.. చక్కని చిత్తరువులు

- చిత్రకళలో రాణిస్తున్న తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు
- జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటుతూ పతకాల పంట
- అంశం ఏదైనా అలవోకగా చిత్రాలు గీస్తూ ఆకట్టుకుంటున్న వైనం
- చిత్రకళ ఉపాధ్యాయుడు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వెలుగులోకి..



చిత్రలేఖనంలో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు (ఫైల్)



తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

తణుకు అర్బన్: చిట్టి చేతులతో ఆకట్టుకునే చిత్రాలు గీస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు తణుకులోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు. అంశం ఏదైనా అలవోకగా చిత్రాలు గీస్తుండటమే కాక పలు ప్రాంతాల్లో నిర్వహించే పోటీల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. చిట్టి చేతుల్లో రూపుదిద్దుకున్న పలు చిత్రాలు జాతీయ స్థాయిలో బంగారు పతకాల పంట పండిస్తున్నాయి. ఏ అంశంలో చిత్రాన్ని వేసినా ఆ అంశం ఆ చిత్రంలో ఇమిడిపోవడం ఆ విద్యార్థుల ప్రతిభకు తార్కాణం. ఇక్కడి విద్యార్థులు చిత్రకళ పోటీల్లో పాల్గొంటున్నారంటే ఇక పతకాలు వారికే సొంతం అనేంతగా చిత్రకళలో ఎదుగుతున్నారు. పాఠశాలలో చిత్రకళలో విద్యార్థులకు అందుతున్న శిక్షణ, ఉపాధ్యాయుల కృషితో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

జాతీయ స్థాయిలో..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు, చిత్రకళ ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. గుంటూరు, నెల్లూరు, విజయవాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, వాతావరణ కాలుష్యం, పచ్చదనం–పరిశుభ్రత, జాతీయ నాయకుల చిత్రాలు వంటి అంశాల్లో విద్యార్థుల గీసిన చిత్రాలు ఆహుతులను ఆలోచింపచేయడమే కాకుండా పలు పతకాలను సాధించిపెడుతున్నాయి. ఇటీవల నెల్లూరు, విజయవాడలో జరిగిన జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో 35 మంది విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించడం విశేషం. చిత్రకళలో విద్యార్థులకు నేర్పిస్తున్న మెలకువలతోపాటు విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 100 మందికి పైగా విద్యార్థులు చిత్రకళలో సత్తా చాటుతున్నారు.

కట్టిపడేస్తుంటాయి



మా విద్యార్థులు వేసే చిత్రాలు ఒకోసారి నాకే ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. చిత్రకళలోని మెలకువలను చెప్పగానే పట్టేసే స్వభావం మా విద్యార్థుల్లో ఉంది. ఏ ప్రాంతంలో పోటీలకు వెళ్లినా పతకాలతో తిరిగి రావడం అలవాటుగా మారింది. ఎంతో తపనతో సాధన చేసే విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం బాగుంది. – **డాక్టర్ వెంపటాపు, చిత్రకళ ఉపాధ్యాయుడు, తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు**

చిత్రకళపై పట్టు సాధించా



చిత్రకళలో చిన్ననాటి నుంచి ఉన్న ఇష్టంతో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలులో గురువులు ద్వారా చిత్రకళను నేర్చుకున్నాను. వివిధ ప్రాంతాల్లో నిర్వహించే చిత్రకళా పోటీల్లో పాల్గొనడమే గతంలో గొప్పగా ఉండేది. ఇప్పుడు బంగారు పతకాలు సాధించేలా చిత్రకళపై పట్టు సాధించా. నాకు చాలా సంతోషంగా ఉంది. – **టి.రవిచరణ్, విద్యార్థి**

ఆసక్తి ఉంటే చాలు.. నేర్చుకోవచ్చు



చిత్రాలను గీయడంలో కొంచెం ఆసక్తి ఉంటే చాలు. మా పాఠశాలలో గురువులు చెబుతున్న మెలకువలు చాలా సులువుగా ఉంటాయి. మామూలుగా డ్రాయింగ్ క్లాస్‌లో చెప్పిన పాఠాలతోనే నేను నేర్చుకున్నాను. ఇప్పుడు పోటీల్లో బంగారు పతకాలు సాధించేలా చిత్రాలు వేయగలుగుతున్నాను. – **టి.ఆదిలక్ష్మి, విద్యార్థిని**

ఎక్కువ సమయం సాధన చేస్తా



డ్రాయింగ్ అనేది నాకు చాలా ఇష్టమైన సబ్జెక్ట్. చిత్రాలను గీయడంపై సాధన కోసం ఎక్కువ సమయం కేటాయిస్తుంటాను. మెలకువలు నేర్చుకోవడంతో మరింత దృష్టి సారించి పోటీల్లో పాల్గొనే స్థాయికి చేరాను. పాఠశాల నుంచి వివిధ కాంపిటీషన్స్‌కు వెళ్లి బంగారు, వెండి పతకాలు సాధించాను. – **ఎస్.జోషిక, విద్యార్థిని**

మెలకువలు నేర్పించారు



డ్రాయింగ్ తరగతి అంటే నాకు చాలా ఇష్టం. డ్రాయింగ్ నేర్పించే విధానం చాలా బావుంటుంది. అర్థమయ్యే రీతిలో చెప్పడమే కాకుండా సులువుగా చిత్రాన్ని వేసేలా ఉపాధ్యాయులు మెలకువలు నేర్పించారు. అందుకే నేను పాల్గొనే ప్రతి పోటీలో పతకాలు సాధిస్తుంటాను. – **ఎస్.ఖ్యాతిక, విద్యార్థిని**

హత్య కేసులో భార్యాభర్తల అరెస్ట్

ముదినేపల్లి రూరల్: చిగురుకోటలో జరిగిన మహిళ హత్య కేసులో నిందితులైన భార్యాభర్తలను అరెస్టు చేసినట్లు ఎస్సై డి.వెంకటకుమార్ బుధవారం చెప్పారు. చిగురుకోటకు చెందిన భార్యాభర్తలు దేవి, పరసా బాలాజీలకు తుమ్మా సురేష్–అనిత మధ్య సరిహద్దు విషయమై ఈ నెల 3న ఘర్షణ జరగ్గా భార్యాభర్తలైన సురేష్, అనితలు బాలాజీ భార్య దేవిపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 5న మరణించింది. ఈ ఘటనపై కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితులైన భార్యభర్తలు సురేష్, అనితలను మంగళవారం అరెస్టు చేసి కైకలూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రెడ్డిగణపవరంలో హుండీ చోరీ



శివాలయంలో హుండీని పగులగొట్టిన దృశ్యం

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలోని శివాలయంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గుడి తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించి హుండీ ధ్వంసం చేసి నగదు అపహరించడమే కాక సీసీ టీవీ సామగ్రిని అపహరించారని ఆలయ ధర్మకర్తలు భౌమరాజు ధనుంజయరాజు, సత్యనారాయణ రాజు చెప్పారు. ఉదయం స్వామివారికి పూజ చేసేందుకు పూజారి వచ్చి చూడగా గుడి తలుపులు పగలకొట్టి ఉండటాన్ని గమనించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. తాము వచ్చి పరిసరాలను పరిశీలించగా హుండీ పగలకొట్టి ఉందని, సీసీ కెమెరా సామగ్రిని పట్టుకుపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

శ్రీవారి క్షేత్రంలో జ్యూస్ దుకాణం సీజ్

- నిల్వ పాలు వినియోగిస్తున్నట్లు అజ్ఞాత భక్తుడు ఫిర్యాదు
- ఆలయ అధికారుల తనిఖీల్లో 217 నిల్వ ప్యాకెట్ల గుర్తింపు
- వ్యాపారిపై కేసు నమోదు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



జ్యూస్ షాపులో ఉన్న నిల్వ పాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఆలయ అధికారులు



నిల్వ పాల ప్యాకెట్ల శాంపిల్స్‌ను సేకరించి, కేసు నమోదు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి రామరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో జ్యూస్‌ల తయారీలో నిల్వ పాల ప్యాకెట్లను వినియోగిస్తూ భక్తుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఒక వ్యాపారి బాగోతం ఒక అజ్ఞాత భక్తుడి ఫిర్యాదుతో బుధవారం బట్టబయలయ్యింది. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ తూర్పు ప్రాంతంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక వ్యాపారి శ్రీ లక్ష్మి దుర్గ బాలాజీ జ్యూస్ షాపును నిర్వహిస్తున్నాడు. ఆ షాపులో నిల్వ పాల ప్యాకెట్లను జ్యూస్‌ల తయారీకి వినియోగిస్తున్నారని ఒక అజ్ఞాత భక్తుడు దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేశాడు. దాంతో సదరు జ్యూస్ షాపులో ఆలయ సూపరింటిండెంట్‌లు డి.వెంకట నరసింహ రాజు, హయగ్రీవా అప్పలాచార్యులు ఉదయం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. షాపులోని ఫ్రిజ్‌లో మొత్తం 217 పాల ప్యాకెట్లు ఉండగా, అవన్నీ నిల్వ ప్యాకెట్లుగా అధికారులు గుర్తించారు. అనంతరం పంచనామాను నిర్వహించి ఈనెల 4వ తేదీతో గడువు ముగిసిన 96 పాల ప్యాకెట్లు, 6వ తేదీతో ముగిసిన 16 ప్యాకెట్లు, 9వ తేదీతో గడువు ముగిసిన 100 ప్యాకెట్లను, వీటికన్నా ముందు తేదీలకు సంబంధించిన 5 ప్యాకెట్లను మొత్తం 217 పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించి సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న ఏలూరు డివిజన్–1 ఫుడ్ సేఫ్టీ అధికారి కె.రామరాజు తన సిబ్బందితో కలిసి జ్యూస్ షాపును పరిశీలించి, నిల్వ పాల ప్యాకెట్ల శాంపిల్స్‌ను సేకరించారు. ఆ తరువాత షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, నోటీసు జారీ చేశారు. సదరు జ్యూస్ షాపును దేవస్థానం అధికారులు తాత్కాలికంగా సీజ్ చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను గోదావరిలో పడవేయవద్దు

- పోలవరం సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య
- టూరిజం బోట్‌ల యజమానులు, నిర్వాహకులతో సమావేశం



పోలవరంలో మాట్లాడుతున్న సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య

పోలవరం రూరల్: వన్యప్రాణుల సంరక్షణార్థం గోదావరి నదిలో పొల్యూషన్ లేకుండా చూడాలని సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య అన్నారు. పోలవరం అటవీశాఖ కార్యాలయం వద్ద బుధవారం టూరిజం బోట్‌ల యజమానులు, నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ డీఎఫ్‌వో మాట్లాడుతూ నేషనల్ పార్క్ పరిధిలో పాపికొండల సందర్శనకు తిరిగే టూరిజం బోట్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలను గోదావరి నదిలో పడవేయకూడదన్నారు. పర్యాటకులు వాడి వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలు, డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు, డ్రింక్ బాటిళ్లు నదిలో పారవేయకుండా బోట్లలో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలలో వేసేలా బోటు యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి నదీ ఒడ్డున ఎక్కడా వ్యర్థాలు చేరకుండా చూడాలన్నారు. గండిపోశమ్మ గుడి నుంచి పేరంటపల్లి వరకు వెళ్లి తిరిగి వచ్చే టూరిజం బోట్లలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో వేయకుండా బోటు యజమానులు, సిబ్బంది పర్యాటకులకు తెలియజేయాలన్నారు. బోటు యజమానులకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో పోలవరం, కుక్కునూరు అటవీశాఖ రేంజ్ అధికారులు దావీద్‌రాజు, ఏడుకొండలు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దివ్యదక్షిణ, ఉత్తరాఖండ్ యాత్రలు

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దేవభూమి ఉత్తరాఖాండ్ యాత్ర, దివ్య దక్షిణ యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా చెప్పారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యాత్రల వివరాలను ఆయన వెల్లడించారు. దివ్య దక్షిణ యాత్ర ఆగస్టు 4న ప్రారంభమై 12వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో భాగంగా అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రమ్, తిరుచీ, తంజావూర్ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చన్నారు. ఈ రైలు ఆగస్టు 4న మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్‌లో ఆగుతుందన్నారు. ఈ యాత్రకు సంబంధించి స్లీపర్ క్లాస్ రూ.14,250, థర్డ్ ఏసీ రూ.21,900, సెకండ్ ఏసీ రూ.28,450గా టికెట్ ధరలు నిర్ణయించామన్నారు.

9 నుంచి ఉత్తరాఖండ్ యాత్ర

దేవభూమి ఉత్తరాఖాండ్ యాత్రలో భాగంగా భారత్ గౌరవ్ రైలు ఆగస్టు 9న ప్రారంభమై 20వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. ఈ రైలు విశాఖపట్టణంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై రాజమండ్రి, విజయవాడలో ఆగుతుందన్నారు. యాత్రలో భాగంగా భీమాల్, అల్మోరా, కౌసని, రాణిఖేత్ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చన్నారు. యాత్ర 10 రాత్రులు,11 పగలు జరుగుతుందన్నారు. థర్డ్ ఏసీ రూ.28,020, డీలక్స్ రూ.35,340గా టికెట్ ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. యాత్రల్లో భాగంగా ప్రయాణికులకు అల్పాహారం, ఆహారం, రాత్రి భోజనం అందజేస్తామన్నారు. యాత్రల్లో భాగంగా రవాణా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఐఆర్‌సీటీసీ చీఫ్ సూపర్‌వైజర్ వీవై ప్రసాద్ మాట్లాడుతూ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైలు ప్యాకేజీలు, ఎయిర్ ప్యాకేజీలు అందిస్తున్నట్లు చెప్పారు. యాత్రల పూర్తి వివరాల కోసం బాలాజీ 92810 30714, ప్రవీణ్ 92814 95848 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

13న విజయవాడలో సౌత్ జోన్ త్రోబాల్ సెలెక్షన్స్

తాడేపల్లిగూడెం (టీటీసీ): సౌత్ జోన్ త్రోబాల్ టోర్నమెంట్ సెలెక్షన్స్ విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 13న నిర్వహించనున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ఏఆర్‌కే వర్మ, జనరల్ సెక్రటరీ ఎస్ఎం శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, స్త్రీల విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, వీటిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఆగస్టులో బెంగుళూర్‌లో జరిగే సౌత్ జోన్ టోర్నమెంట్‌కు పంపుతామని చెప్పారు. క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, ఎనిమిది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 97012 03030, 72879 65417 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

త్వరలో కోళ్ల పెంపకంపై శిక్షణ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో త్వరలో నిర్వహించే కోళ్ల పెంపకం వాటి యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమానికి ఆసక్తి గల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు, మహిళలు, గ్రామీణ యువత చిన్నతరహా కుటీర పరిశ్రమగా కోళ్ళ పెంపకాన్ని చేపట్టదలచిన వారు పేర్లు వెంటనే నమోదు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం 99896 23823 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవాలని కోరారు.

పోస్ట్‌మాస్టర్‌పై చర్యలకు వినతి

ఏలూరు (టూటౌన్): పోస్టల్ శాఖకు నష్టం కలుగజేసిన పోస్టుమాస్టర్ గంజి గంగాధర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడలో పోస్ట్‌మాస్టర్ జనరల్‌కు ప్రజా సంఘాల నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వివరాలను ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ఏలూరు పెద్ద పోస్టాఫీస్ హెడ్ పోస్ట్‌మాస్టర్‌గా గంజి గంగాధర్ గత నెల నాలుగో తేదీ వరకు విధులు నిర్వహించారు. 2023 అక్టోబర్‌లో పెద్ద పోస్టాఫీస్‌లోని జనరేటర్‌కు సంబంధించిన బ్యాటరీని గంగాధర్ తన సొంత ప్రయోజనాల కొరకు దాచి వేసి దొంగలు ఎత్తుకుపోయినట్లుగా చిత్రీకరించి కాపలాదారులైన ఇద్దరు నైట్‌వాచ్‌మెన్ల నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. పాత బ్యాటరీనే జనరేటర్‌కు బిగించి వాడారన్నారు. జంగారెడ్డిగూడెంకు గంగాధర్ బదిలీపై వెళుతూ ఇదే బ్యాటరీని వెంట తీసుకెళ్లారని ఆరోపించారు. దీంతో ఏలూరు కార్యాలయంలో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, పోస్ట్‌మాస్టర్ గంగాధర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నేతల రమేష్‌బాబు, భూపతి అప్పారావు, కొత్తల పూర్ణమల్లికార్జున్ ఉన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి



జక్కరంలో మాట్లాడుతున్న డీపీఓ విక్టర్

కాళ్ల: గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీఓ ఆర్.విక్టర్ అధికారులను ఆదేశించారు. మీ కోసంలో అందిన ఫిర్యాదుపై విచారణ నిమిత్తం దొడ్డనపూడి గ్రామానికి వచ్చిన సందర్భంగా బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో డీపీఓ మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ ప్రోగ్రాం పై కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఎక్కడ మురుగునీరు లేకుండా ప్రత్యేక తీసుకోవాలని సూచనలు చేశారు. ఈఓపీఆర్‌డీ భాస్కర రావు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆకివీడు: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం రాత్రి సాంకేతిక సమస్యల కారణంగా జనరేటర్ నుంచి మంటలు చెలరేగడంతో ఆసుపత్రిలోని రోగులు, జనం బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో ఆసుపత్రి బయట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. విద్యుత్ సరఫరాలో హెచ్చతగ్గులు, లోఓల్టేజ్ సమస్య, విద్యుత్ సరఫరా వచ్చి ఆగిపోవడం, అధిక లోడు వినియోగం వల్ల ఈ ప్రమాదాలు జరిగాయని చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక సిబ్బంది జనరేటర్‌లోని మంటలను అదుపు చేశారు. ఎవరికీ ప్రాణ హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

చినతాడేపల్లి పంచాయతీ చెరువులకు వేలం పాట



చినతాడేపల్లి పంచాయతీ వద్ద చెరువులకు వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చిన తాడేపల్లి పంచాయతీ పరిధిలోని మూడు చెరువులకు బుధవారం సర్పంచ్ పిచ్చుకల రాజారావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. గ్రామంలోని కొత్త చెరువు 20 ఎకరాలకు గాను రూ.25లక్షలు, వడుపు చెరువు 27 ఎకరాలకు రూ.29లక్షలు, అంకుడు చెరువు 24 ఎకరాలకు గాను రూ.29లక్షలు వేలం పాట ద్వారా వచ్చిందని సర్పంచ్ పిచ్చుకల రాజారావు వివరించారు. మూడు చెరువులపై దాదాపు రూ.83లక్షలు పంచాయతీకి ఆదాయం సమకూరనుందన్నారు. మూడేళ్ల కాలపరిమితికి గాను ఈ వేలం పాట జరిగిందన్నారు. ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, ఎమ్పీటీసీ దూలపల్లి సత్తియ్య, డీడీవో రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వార్డులో హెల్త్ సిబ్బందిచే ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలో బుధవారం స్థానిక 30, 31 వార్డుల్లో వైద్యాధికారి డాక్టర్ అనూష ఆధ్వర్యంలో కమ్యూనిటీ మలేరియా నివారణ మాసోత్సవాలు జరిగాయి. ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా అవగాహన కార్యక్రమాలు జరిగాయి. వైద్య సిబ్బందికి, ప్రజలకు లార్వా బ్రీడింగ్ ప్రదేశాలను కొనుగొనుట, మునిసిపల్ సహకారంతో కీటక నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ జ్వర లక్షణాలను బట్టి చికిత్స అందజేయాలన్నారు. ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు రమణ, చంద్ర, సహాయకులు కాంతారావు, ఆశా కార్యకర్త రజనీ, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీలత పాల్గొన్నారు.

బలుసులమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు



బలుసులమ్మ అమ్మవారి హుండి లెక్కిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయంలో బుధవారం 115 రోజులకు గాను హుండి లెక్కింపు కార్యక్రమం జరిగింది. రూ.4,89,288లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి రవి శంకర్, ఇన్‌స్పెక్టర్ సుజన్ కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, సేవా దళ సభ్యులు పాల్గొన్నారు.

పెనుగొండ అభివృద్ధికి కృషి

పెనుగొండ: పెనుగొండ అభివృద్ధికి ప్రతిపాదనలు చేయనున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తెలిపారు. బుధవారం పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. 20 మంది సభ్యులకు 18 మంది హాజరుకాగా 31 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సహకారంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ శాశ్వత నిత్యాన్నదాన ప్రసాద వితరణకు పట్టణానికి చెందిన గొట్టుముక్కల సత్యనారాయణరాజు, శైలజ దంపతులు రూ.25 వేలు, గొట్టుముక్కల వెంకట పవన్ కుమార్, శ్వేత దంపతులు రూ.25 వేలు, భూపతిరాజు ఆనంద్ విజయ వర్మ, శ్రీలలిత రూ.25 వేలు, వేగేశ్న రాజంరాజు, లీలాకుమారి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు.

పాము కాటుతో రైతు మృతి

పాలకోడేరు: పాము కాటుతో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం శృంగవృక్షంలోని చినపేటకు చెందిన దుండి లక్ష్మణరావు పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పొలం వెళ్లగా అక్కడ పాము కాటు వేసింది. స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు దగ్గరలోని ఆస్పత్రికి తీసుకు వెళ్లిన కొద్దిసేపటికి లక్ష్మణరావు మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి



తాడేపల్లిగూడెం: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



ఇరగవరం: తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశవ్యాప్తంగా పని చేస్తున్న కార్మికవర్గాల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ కార్మికుల కోర్కెల దినం సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తాడేపల్లిగూడెం సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావులు మాట్లాడుతూ ఆశ వర్కర్స్‌కి కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. పీఎఫ్ బకాయిలు సకాలంలో చెల్లించకుండా జాప్యం జరుగుతుందని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, జాతీయ నగదు బదిలీకరణ పథకం ఆపాలని, అన్ని రకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సమర్థవంతంగా నడపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, అంగన్‌వాడీ, ఆశాలు, మిడ్డే మీల్స్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న స్కీమ్ వర్కర్లు

ఇరగవరంలో డిమాండ్స్ డే సందర్భంగా ధర్నా

ఇరగవరం: కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం ముందు డిమాండ్స్‌డే సందర్భంగా అంగన్‌వాడీ కార్మికులు ధర్నా చేశారు. ఈసందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందని కానీ కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఈసందర్భంగా డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేసారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్మికులు పి శ్యామల, సత్యదేవి, అంజనాదేవి, రత్నకుమారి, పి భూలక్ష్మి, రోజా తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

అత్తిలి: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన డిమాండ్స్ డే భాగంగా బుధవారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. స్కీమ్ వర్కర్లెన్ని అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, ఉపాధి హామీ పథకం తదితర రంగాల్లో పనిచేసే వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కె ధర్మేంద్ర మాట్లాడుతూ కార్మికులకు పెన్షన్ పథకం వంటి సామాజిక భద్రత కల్పించాలని నెలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఈసందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ తాతారావుకు అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు నీతిపూడి వెంకటలక్ష్మి, దీపిక, సత్యవతి, ఆశ వర్కర్స్ నాయకులురాలు ఏడీ మల్లీశ్వరి, రైస్‌మిల్ వర్కర్స్ బి సత్యనారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలి



అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఏఎన్‌ఎం విజయలక్ష్మి

అత్తిలి: బాలికల సంరక్షణ, వారి సమగ్ర అభివృద్ధి కోసం తల్లిదండ్రులు కృషి చేయాలని ఏఎన్‌ఎం విజయలక్ష్మి చెప్పారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మిషన్‌శక్తి 100 రోజుల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల సంరక్షణ, సాధికారతపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వీఎల్ఎస్ కుమారి, నంది విజయ, ఆశ వర్కర్లు ధనలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం: స్థానిక ఆదికవి నన్నయ్య ప్రాంగణంలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కొవ్వూరు దివ్య ఏపీసెట్ 2024లో భౌతిక శాస్త్ర విభాగంలో అర్హత సాధించారు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ తుపాకుల అశోక్ విద్యార్థినిని అభినందించారు. ప్రతి విద్యార్థి దివ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



తణుకు నరేంద్ర సెంటర్‌లో ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తణుకు: కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. బుధవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ ఆల్ ఇండియా పిలుపులో భాగంగా కార్మికులు ధర్నా, ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులు ఎన్నో పోరాటాలు ద్వారా సాధించుకున్న చట్టాలు నాలుగు లేబర్‌కోడ్స్‌గా తీసుకొచ్చారని అన్నారు. కార్మిక చట్టాలు మార్పుల కారణంగా కార్మికులను బానిసలుగా చేస్తున్నారన్నారు. స్కీమ్ వర్కర్లను రెగ్యులైజ్ చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు, పెన్షన్లు ఇవ్వాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు గార రంగారావు, పీఎల్ నర్సింహారావు, పి.దక్షిణా మూర్తి, రమేష్, రామకృష్ణ, హర్షవర్ధన్, లక్ష్మీనారాయణ, గోవిందరాజు, పాపారావు, భారతి, ధనలక్ష్మి, జ్యోతి, వసంత పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



డిపో మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సుల ప్రయాణాల్లో ప్రయాణికులు తమ సలహాలు, ఫిర్యాదులు తెలిపేందుకు బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో తణుకు డిపో నుంచి కడపకు బస్సు సర్వీసు పునరుద్దరించాలని, విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులను కైకరంలో ఆగేలా చర్యలు తీసుకోవాలని, తణుకు నుంచి విజయవాడకు అల్ట్రా డీలక్స్‌లు, సూపర్‌లగ్జరీలతోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా నడపాలని కోరినట్లు వివరించారు. ప్రయాణికులు తెలిపిన సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): డయల్ యువర్ డీఎంకు ఐదు విజ్ఞప్తులు వచ్చాయి. ఆర్టీసీ డీఎం కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. పట్టణంలోని ఏలూరు వైపు కెనాల్ పాయింట్ వద్ద షెల్టర్ ఏర్పాటుచేయాలని, అమలాపురం డిపో బస్సుల్లో విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం ప్రయాణీకులను అనుమతించడం లేదని, ప్రత్తిపాడు నుంచి తాడేపల్లిగూడెం వచ్చు బస్సులు ప్రత్తిపాడు పంచాయతీ ఆఫీస్ వద్ద ఆపడం లేదని, తాడేపల్లిగూడెం నుంచి రావులపాలెంకు ఉదయం 5.30, 6.30 సమయంలో బస్సులు నడపాలని, తాడేపల్లిగూడెం నుంచి విజయవాడకు వెళ్లు ప్రయాణీకులకు బస్సులు గూడెం డిపో నుంచి వచ్చే విధంగా చూడాలని, సాయంత్ర సమయాల్లో రాజమండ్రి నుంచి తాడేపల్లిగూడెం వచ్చు బస్సులు సమయ పాలన పాటించే విధంగా చూడాలని ప్రయాణీకులు విన్నవించారు. ప్రాయాణికులు తెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజలకు అండగా ఉంటా



రామన్నగూడెంలో జరిగిన విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో కూటమి విజయోత్సవ సభ నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు వద్దని, కలిసికట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

తాడేపల్లిగూడెం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరు పీహెచ్‌సీకి పరికరాలు బహూకరణ



వేల్పూరు పీహెచ్‌సీకి దాతలు అందించిన వైద్య పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు టౌన్: మండలం వేల్పూరు ప్రాథమిక కేంద్రానికి గ్రామ మాజీ సర్పంచ్ పెనుమర్తి సోమ సూర్యచంద్రరావు (దత్తుడు) కుమార్తె, కుమారుడు రూ. 1 లక్ష 50 వేల విలువైన పరికరాలు బెడ్‌లు, 5 పారా విటాల్ మానిటర్, సీటీజీ మెషీన్‌లను అందజేశారు. బుధవారం వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతులమీదుగా దాతలు దోనేపూడి జయమాధురి, నాగేంద్రబాబు ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, ఉప సర్పంచ్ గుణ్ణం రాజారావు, మాజీ ఎంపీపీ ఆరిమిల్లి అలివేలు మంగ తాయారు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సునంద, మాజీ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్ర ప్రసాద్, టీడీపీ, బీజేపీ, జన సేన పార్టీ నాయకులతో పాటు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్ర ప్రగతికి బాట

తణుకు: ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట అని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వ్యాఖ్యానించారు. ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం అభినందనీయమన్నారు. బుధవారం తణుకులోని కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ బసవా రామకృష్ణ, తణుకు పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఇరగవరం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

ఇరగవరం: కండరాలు బిగుసుకుపోయి, నడవలేని, కూర్చోలేనివారికి క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ సేవలు అందజేయాలని ఎంఈవో-2 జీబీవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని దివ్యాంగుల భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంటి వద్ద వ్యాయామం చేయించాలన్నారు. సమగ్ర శిక్ష ద్వారా భవిత కేంద్రంలో దివ్యాంగులకు అందిస్తున్న ప్రత్యేక విద్య, ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ఏ జగదీష్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి రేణుక, సీఆర్‌పీ శ్రీనివాస్, ఎంటీ గాలేశ్వరరావు, వై జగదీష్, కేర్ టేకర్ కె రమావిజయకుమారి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గర్భిణులు విధిగా ఆహార నియమాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. పట్టణంలోని 12వ వార్డు పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కూటమి నాయకులు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరక్టర్ దాట్ల జగన్నాథరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి, తాటికాయల వీరన్న, ఎస్.సురేష్, రామకృష్ణ, వాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

పెనుగొండ: కిడ్నీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న పోడూరు మండల జనసేన మాజీ అధ్యక్షుడు గుడాల రాజేష్‌కు పెనుగొండలో పల్లపు వీధియువత శ్రీరమసాయి యువజన సంఘం ద్వారా బుధవారం రూ.57,332 ఆర్థిక సహాయం అందించారు.

పారిశుద్ధ్య సమస్యలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ బీవీ రమణ

తణుకు అర్బన్: ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య నిర్వహణ కీలకపాత్ర పోషిస్తుందని డిప్యూటీ కలెక్టర్, తణుకు మునిసిపల్ కమిషనర్ బీవీ రమణ అన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో బుధవారం శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడా కూడా చిన్నపాటి ఇబ్బంది తలెత్తకుండా శానిటేషన్ విభాగం పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వార్డు హెల్త్ సెక్రటరీలు క్రమం తప్పకుండా ఫీవర్ సర్వే చేయాలని, గృహ దర్శనాల్లో ఏడిస్ లార్వా గుర్తింపు నేపథ్యంలో వారానికోసారి డ్రైడే చేసే విధంగా ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. స్టాప్ డెంగీ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, శానిటరీ ఇనస్పెక్టర్స్ గోవిందయ్య, రాజశేఖర్, ఆర్ఐ శింగులూరి వెంకటరమణ, ఫైలేరియా సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్స్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి



స్కిన్నెరపురంలో పశుపోషకులకు ఖనిజ లవణాల ప్యాకెట్లను అందజేస్తున్న పశువైద్యులు

అత్తిలి: పశువుల సంరక్షణలో పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ కె శంకరభావన్నారాయణ అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి సహకారంతో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో లేగ దూడలకు నట్టల నివారణ మందులు, గోమార్లు మందులు, ఖనిజ లవణాల మిశ్రమం, గర్భ కోశ వ్యాధుల నివారణ మందులను ఉచితంగా అందజేశారు. పశు గ్రాస వారోత్సవాలు సందర్భంగా వివిధ రకాలైన పశుగ్రాసాల గురించి పశువైద్యాధికారి కె శంకర భావన్నారాయణ పాడిరైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాల భానులలిత మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూరాకుల లక్ష్మి, గ్రామ ప్రముఖులు గనిసెట్టి శ్రీనివాస్, బాలం మహేష్, అత్తిలి పశుగణాభివృద్ధి సంఘం ఈఓ డాక్టర్ జి జేసురత్నం, అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె నరశింహారావు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరినాట్లు వేగంగా పూర్తి చేసుకోవాలి



కవిటంలో వరినాట్లను పరిశీలిస్తున్న పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి, వ్యవసాయ శాఖ సిబ్బంది

పోడూరు: రైతులు వీలైనంత త్వరగా వరినాట్లు వేయడం పూర్తి చేయాలని పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి సూచించారు. మండలంలోని కవిటం, తూర్పుపాలెం, పండితవిల్లూరు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో నారుమడులను, వరినాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడుల్లో నారు తీయడానికి వారం రోజులు ముందు 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు 5 సెంట్ల విస్తీర్ణానికి 1 కేజీ చొప్పున చల్లాలన్నారు. నాట్లు వేసే సమయంలో తప్పనిసరిగా నారు చివరలను తుంచివేసి నాట్లు వేయాలనీ, దమ్ములో తప్పనిసరిగా బాస్వరం, పొటాష్ వేసుకోవాలనీ, నత్రజనిని బురదపదును మీద దఫదఫాలుగా వేయాలని సూచించారు. నీటి యాజమాన్యంపై ఏడీఏ రైతులకు పలు సూచనలు చేశారు. ఎక్కడైనా సాగునీటి సమస్య ఉంటే వ్యవసాయశాఖ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వీఏఏలు గ్రామాల్లో రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

జీవిత బీమా ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జీవిత బీమా పాలసీలకు పట్టాదారులు చెల్లించే ప్రీమియంపైన జీఎస్టీ (గూడ్స్ సర్వీస్ ట్యాక్స్)ని పూర్తిగా తొలగించి, బీమా పరిశ్రమను ప్రోత్సహించాలని బీమా పెన్షనర్లు సంఘం నాయకులు గరికపాటి బాపయ్య శర్మ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుమారు 30 కోట్లు జీవిత బీమా పట్టాదారులకు జీఎస్టీ 18 శాతం చెల్లించడం భారంగా పరిణమించిదని, జీవిత బీమా పరిశ్రమకు అవరోధంగా ఉన్న జీఎస్టీని రాబోయే కేంద్ర బడ్జెట్‌లో పూర్తిగా తొలగించాలని బాపయ్య శర్మ కోరారు. ప్రజలందరికి అత్యంత అవసరమైన బీమా, పొదుపును ప్రోత్సహించేందుకు తప్పనిసరిగా జీఎస్టీని తొలగించాలన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

భీమవరం: వీరవాసరం మండలం మడుగుపోలవరం పంచాయతీ పరిధిలోని జొన్నలపాలెంలో రామాలయం పునర్నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడుతూ జొన్నలపాలెంలో రామాలయ పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయగా నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అయితే గ్రామంలోని కొందరు అక్రమంగా రామాలయం స్థలంలోకి చొరబడి గుడి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్నారు. గుడి నిర్మాణాన్ని అడ్డుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు పల్లా సర్వారాయుడు, అఖిల్, గరికిముక్కు సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.